సాక్షి
జనగామ

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



చెరువు శిఖం కబ్జా

భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురైంది. సుమారు 20 ఎకరాల మేర ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.30కోట్ల వరకు ఉంటుంది. - 8లో▸



మత సామరస్యానికి ప్రతీక

మత సామరస్యానికి ప్రతీకగా వరంగల్ ఉర్సు జాగీర్ ప్రాంతంలోని హజ్రత్ మామాఖ్ రబ్బాని(రహమతుల్లా అలై) దర్గా నిలుస్తున్నది. - 8లో▸

గరిష్టం/కనిష్టం $33^0/15^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు క్యాండిల్ ర్యాలీ

జనగామ రూరల్: పుల్వామా దాడిలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ ఈనెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే క్యాండిల్ ర్యాలీని విజయవంతం చేయాలని పారా మిలటరీ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డేగల సంపత్ పిలుపునిచ్చారు. సాయంత్రం రైల్వేస్టేషన్ ప్రాంగణం నుంచి బస్టాండ్ సర్కిల్‌లోని అమర వీరుల స్థూపం వరకు క్యాండిల్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాధనంతో రాజభోగాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి




తరిగొప్పుల: ప్రజల ధనంతో సీఎం కేసీఆర్ కుటుంబం రాజభోగాలు అనుభవిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన మండలకేంద్రంతో పాటు నర్సాపూర్, సోలీపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన మాట్లాడారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి రాష్ట్ర ఖజానాను ముఖ్యమంత్రి కొల్లగొట్టాడని ఆరోపించారు. రాష్ట్రంలో భూకబ్జా కోరులపై సర్వే చేస్తే మొదటి స్థానంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉంటాడని అన్నారు. కార్యక్రమంలో బండ ప్రసాద్, ధరావత్ రాజు, ముక్కెర కర్ణాకర్‌రెడ్డి, పబ్బోజు రాంబ్రహ్మాచారి, జంగ వీరకుమార్, నవీన్, శిలువేరు వెంకటేష్, కొన్నె రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐలోనిలో భక్తుల సందడి



ఐనవోలు: వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం ఐనవోలుకు తరలివచ్చిన భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో మల్లన్న సన్నిధిలో సందడి ప్రారంభమైంది. స్వామివారికి నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించి.. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలతో స్వామివారిని అభిషేకించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకుని వారి పితృదేవతలను పూజించారు. అదేవిధంగా బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో భక్తుల రద్దీ అధికం కావడంతో.. ప్రత్యేక దర్శనం టికెట్లను చాలామంది కొనుగోలు చేశారు.



నడిరోడ్డుపై బైక్ స్టంట్లు..



అధిక వేగం ప్రమాదకరం.. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపకూడదు.. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దు అంటూ పోలీసుశాఖ ఓ వైపు హెచ్చరికలు చేస్తూనే ఉంది. అయినా పరిస్థితుల్లో మార్పు రావడంలేదు. నిండా 18 ఏళ్లు నిండని ఒకరు.. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జనగామ శామీర్‌పేటగడ్డలోని రమాదేవి ఫంక్షన్ హాల్ ఎదుట బైక్‌పై అటూ ఇటూ స్టంట్స్ చేస్తూ రోడ్డు వెంట వెళ్లే ఇతర ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేయడం 'సాక్షి' కంట పడింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ

పశుమిత్రలకు పస్తులేనా..!

- ఎనిమిదేళ్లుగా ఉచిత సేవలు
- రవాణా ఖర్చులు భరిస్తూ విధులు
- సర్కారు నుంచి కనీస వేతనం కరువు
- సేవా రుసుము అడిగితే రైతుల నుంచి చీదరింపులు
- పట్టించుకోని ప్రభుత్వం.. ఆర్థిక ఇబ్బందుల్లో పశుమిత్రలు



కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పశుమిత్రలు, సీఐటీయూ నాయకులు(ఫైల్)

పశుమిత్రల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అటు సర్కారు నుంచి ఎలాంటి గౌరవ వేతనం లేదు.. ఇటు నిత్యం రవాణా ఖర్చులు భరిస్తూ గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలందించి డబ్బులడిగితే రైతుల నుంచి చీద్కారాలు.. ఖాళీ చేతులతో ఇంటికి రావడం మామూలైపోయింది. విధులు నిర్వహిస్తున్నా నయాపైస రాకపోవడంతో ఏళ్లతరబడి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు.

– జనగామ రూరల్

మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో పశువైద్య కేంద్రాలు, పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటి పని వేళలు ముగిశాక అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో రోగాల బారిన పడిన పశువులకు ప్రాథమిక చికిత్స అందించే పరిస్థితి లేకుండా పోయింది. అనేక సందర్భాల్లో మూగజీవాలు మృత్యువాత పడుతుండడంతో వాటి పోషకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి 2015లో రాష్ట్ర ప్రభుత్వం పశుమిత్రుల పథకం తీసుకొచ్చింది. ఈ మేరకు పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కు బాధ్యత అప్పగించింది. దీంతో పశుమిత్రలుగా పనిచేయడానికి మహిళా స్వయం సహాయక సంఘాల్లోని పదో తరగతి చదివిన సభ్యులను అర్హులుగా నిర్ణయించి జిల్లాలో 65 మందిని నియమించారు. అందులో డిగ్రీ, పీజీ చదువుకున్న మహిళలు సైతం ఉన్నారు. వారికి ఐకేపీ ద్వారా హైదరాబాద్‌లో వారంరోజుల పాటు వృత్తి శిక్షణ ఇచ్చారు. అనంతరం మండల పశువైద్యాధికారికి అనుసంధానం చేసి మరో నెల రోజులు క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చి ప్రత్యేక కిట్ అందజేశారు. సొంత ఊరితోపాటు సెంటర్ పరిధి రైతులకు సంబంధించిన ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, ఇతర మూగ జీవాలకు చికిత్స అందజేయాలని చెప్పారు. ముఖ్యంగా పశువులకు కృత్రిమ గర్భధారణ, రోగనిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వేయడం, శస్త్రచికిత్స తదితర సేవల బాధ్యత అప్పగించారు.

సేవా రుసుము మాత్రమే..

నియామక సమయంలోనే పారితోషికం ఇవ్వబోమనీ.. మీరు చేసే సేవలకు రైతుల నుంచి రుసుము తీసుకోవాలని చెబుతూ.. మండల పశువైద్యాధికారికి అందుబాటులో ఉండి వారి సూచనల మేరకు విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అయితే సొంత గ్రామాల్లో పశువులకు చికిత్స చేసి డబ్బులు అడగలేని పరిస్థితి ఒకవైపు.. ఇతర గ్రామాల్లో వైద్య సేవలందించి రుసుము అడిగితే 'మీకు ప్రభుత్వం నుంచి జీతాలు వస్తున్నాయి కదా.. మాదగ్గర ఎందుకు అడుగుతున్నారు' అంటూ చీదరింపులు వస్తుండడంతో అడగడమే మానేశారు. ప్రభుత్వం ఎప్పటికైనా తమ సమస్యలు పరిష్కరిస్తుందనే నమ్మకంతో పనిచేస్తున్న వీరు.. రోజూ పశువులకు వైద్య సేవలందించడానికి రవాణా ఖర్చులు పెట్టుకుని గ్రామాలు తిరగడం.. ఖాళీ చేతులతోనే ఇంటిబాట పట్టడం మామూలై పోయింది. పశుమిత్రల్లో ఎక్కువ మంది పేద మహిళలే కావడంతో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు.



గొర్రెకు టీకా వేస్తున్న పశుమిత్ర

వెట్టిచాకిరీ సరికాదు..



రాష్ట్ర ప్రభుత్వం మహిళా పశుమిత్రలతో వెట్టిచాకిరీ చేయించడం సరికాదు. మూగ జీవాలకు నిత్యం వైద్యసేవలు అందిస్తున్న వీరిని పట్టించుకోవాలి. కనీస వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి. స్పందించకుంటే పోరాటం ఉధృతం చేస్తాం.

– రాపర్తి రాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కనీస వేతనం చెల్లించాలి



పశుమిత్రలుగా ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాం. ఇంత వరకు ప్రభుత్వం నుంచి పైసా రాలేదు. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం. మా సేవలను గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. ఇతర సదుపాయాలు కల్పించి ఆదుకోవాలి.

– నాజియా, పశుమిత్రల సంఘం జిల్లా అధ్యక్షురాలు

డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఉద్రిక్తత

- భైఠాయించిన పేదలు
- భారీగా పోలీసుల మోహరింపు

జనగామ: పట్టణంలోని బాణాపురం ఇందిరమ్మ కాలనీలో ఇటీవల నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేదలు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలో నిలు నీడలేని నిరుపేదలకు 'డబుల్ బెడ్రూం' ఇళ్లలో అవకాశం కల్పించేందుకు సోమవారం నుంచి వార్డుల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో గతంలో ఏసీరెడ్డినగర్ నుంచి ఖాళీ చేయించిన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యాన పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ నేతృత్వంలో ఇందిరమ్మ పట్టాలు కలిగిన వారితోపాటు నిరుపేదలతో కలిసి డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్‌ఐలు సిబ్బందితో చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. పేదలు ఇళ్లలోకి వెళ్లే ప్రయత్నంలో పోలీసులు అడ్డుకోగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. లాటరీతో సంబంధం లేకుండా గత హామీల మేరకు అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాల్సిందే అని.. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని పేదలు, నాయకులు హెచ్చరించారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది. కాలనీలో కరెంటు సరఫరా లేకపోవడంతో చీకట్లోనే ఇళ్ల ముందు భైఠాయించి నిరసన తెలుపుతున్నారు.



ఆందోళన చేస్తున్న నిరుపేదలు, నాయకులు

కలెక్టర్ వచ్చే వరకు కదిలేది లేదు..

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ.. గత పాలకులు ఇచ్చిన పట్టాలతో సొంతింటి కోసం లబ్ధిదారులు ప్రయత్నం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనేకమార్లు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, పేదలు ఇర్రి అహల్య, బూడిద గోపి, సుంచు విజేందర్, చందు నాయక్, పందిళ్ల కళ్యాణి, పల్లెర్ల లలిత, చీర రజిత, కొండ వరలక్ష్మి, ఎర్ర రజిత, జయ, కళ్యాణం లింగం, వెంకట మల్లయ్య, బొట్ల శ్రావణ్, గౌసియా, ఎండీ.మునీర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల నుంచి కాపాడండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ: కోతుల బెడద నుంచి రైతులతో పాటు ప్రజలను కాపాడేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రత్యేక చట్టం తీసుకువచ్చేలా పార్లమెంట్‌కు పంపించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కోరారు. ఆదివారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన కోతుల ప్రస్తావన తీసుకువచ్చారు. నిద్రలేచిందే మొదలు.. బ్రేక్ ఫాస్ట్‌కు వచ్చినట్లుగా ఇళ్ల గేట్లు, తలుపుల ముందు కోతులు సిద్ధంగా ఉంటున్నాయని చెప్పారు. ఇళ్లలోకి వెళ్లి వంట సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయని, రోడ్లపై వెళ్లే పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. పంట పొలాలను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్య జనగామలోనే కాదు.. 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉందని, నివారణకు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో వీటితో మరింత ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.

బెల్టు షాపులు లేకుండా చేస్తా..

- వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల
- కొనసాగిన ప్రజాప్రస్థానం పాదయాత్ర

బచ్చన్నపేట/నర్మెట: రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్.. బార్లు, బీర్ల తెలంగాణగా మార్చాడు.. తమకు అవకాశం కల్పిస్తే పల్లెల్లో బెల్టుషాపులు కూడా లేకుండా చేస్తామని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర ఆదివారం నర్మెట మండలం అమ్మాపూర్, వెల్దండ గ్రామాల మీదుగా బచ్చన్నపేట మండలం కేసిరెడ్డిపల్లి, కొడవటూర్, ఆలింపూర్ క్రాస్ మీదుగా సాగి బచ్చన్నపేటకు చేరుకున్నది. మండల కేంద్రంలో షర్మిల మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని, ఫామ్‌హౌస్‌లో కూర్చునే ముఖ్యమంత్రికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని అన్నారు. కుటుంబ పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని పీల్చిపిప్పి చేస్తున్న అవినీతి సర్కారుకు చరమ గీతం పాడాలన్నారు. నాటి వైఎస్ పాలనను మళ్లీ అందించడానికే పార్టీ పెట్టి ప్రజల్లోకి వచ్చాను.. ఆదరిస్తే అందరి బతుకులు బాగుచేస్తానని షర్మిల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య, జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకటరెడ్డి, చేవెళ్ల స్వామి, నాయకులు బొడ్డు ప్రవీణ్, శ్రీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిమాని దీక్ష.. స్పందించిన షర్మిల

షర్మిల కలిసే వరకు ఆమరణ దీక్ష చేపడుతానని లింగంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు ప్రవీణ్ ఆదివారం కొన్నె గ్రామంలోని గజగిరి గుట్టపైకి చేరి దీక్షకు కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ నాగబాబు ప్రవీణ్‌తో మాట్లాడి షర్మిలను కల్పిస్తానని చెప్పడంతో దీక్ష విరమించాడు. అనంతరం బచ్చన్నపేటలో షర్మిలను కలువగా పార్టీ కండువా కప్పి ఇక నుంచి చురుగ్గా పని చేయాలని సూచించినట్లు ప్రవీణ్ తెలిపాడు.



కొడవటూర్‌లో చంటి బిడ్డను ఎత్తుకున్న షర్మిల

నేటి నుంచి జనగామ మండలంలో..

జనగామ: షర్మిల పాదయాత్ర నేటి(సోమవారం) నుంచి జనగామ మండలంలో ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పాదయాత్ర బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల నుంచి జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌కు ఉదయం 10 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి పసరమడ్ల, శామీర్‌పేటలో కొనసాగుతుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రం ఆర్టీసీ బస్టాండు సమీపంలో పబ్లిక్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

కరెంటు కటకట..



ఎండిపోతున్న వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు బుచ్చయ్య

- ఎండుతున్న వరి పంటలు

చిల్పూరు: రైతులు సాగు చేసిన పంటలకు అప్పుడే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. చెరువులు, కుంటలు, బోరుబావుల్లో సమృద్ధిగా నీరు.. 24 గంటల పాటు కరెంటు వస్తుందనే ఆశతో యాసంగిలో వరి వేసిన రైతులకు కరెంటు చుక్కలు చూపిస్తోంది. సరైన నీరందక కళ్లముందే పంట ఎండిపోతుంటే పశువులకు మేతగా వదిలేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 'చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన రైతు మారపాక బుచ్చయ్య అందినకాడ అప్పుచేసి తనకున్న ఎకరా 18 గుంటల భూమిలో యాసంగి వరి సాగు చేశాడు. 15 రోజుల వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అయింది. ఆ తర్వాత ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పంటకు సరిగా నీరు అందక ఎర్రబడి కుళ్లిపోయింది. ఏమి చేయాలో తోచక పశువులను మేతకు వదిలేశాడు. ఇదిలా ఉండగా.. విద్యుత్ సక్రమంగా అందక పంటలు ఎండి పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి సదం రమేష్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నీళ్లున్నా పంట ఎండుతోంది..



నేను 10 ఎకరాల్లో వరి సాగు చేసిన. నెలరోజులు అవుతోంది. రెండు బోర్లు ఉన్నాయి. నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. త్రీఫేజ్ కరెండు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. ఇప్పటి వరకు మూడెకరాల్లో పంట ఎండిపోయింది. రూ.16వేల వరకు పెట్టుబడి నష్టమైంది. మిగతా పంటను ఎట్ల కాపాడుకోవాలో తెలుస్తలేదు. నిరంతరంగా కరెంటు ఇచ్చి ఆదుకోవాలె.

– పోలు మహేందర్, రైతు, కృష్ణాజీగూడెం

చండికా అమ్మవారి ప్రతిష్ఠా ఉత్సవాలు ప్రారంభం

- మంత్రి 'ఎర్రబెల్లి' దంపతుల పూజలు

పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చండికా అమ్మవారి ప్రతిష్ఠా ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సతీమణి ఉషాదయాకర్‌రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటిరోజు శత చండీ యాగం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయంలో ఈనెల 12 నుంచి 16 వరకు జరిగే చండికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, 17 నుంచి 22 వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఈఓ రజనీకుమారి, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, సర్పంచ్ యాకాంతరావు, వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ విశ్వేశర్, ఎస్సై శ్రీకాంత్, అర్చకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎర్రబెల్లి దంపతులు

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు
- పాలకుర్తి టు హైదరాబాద్ పాదయాత్ర షురూ

పాలకుర్తి/పాలకుర్తిటౌన్: గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకుర్తి నుంచి హైదరాబాద్ వరకు యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ఆదివారం రాజీవ్ చౌరస్తాలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తేనే సీఎం కేసీఆర్‌కు గౌరవం ఉంటుందని, లేదంటే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మల్టీపర్పస్ విధానంతోపాటు జీఓ 51ని వెంటనే రద్దు చేయాలని, జీపీ కార్మికులకు వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ సరైన న్యాయం చేయకుండా మోసగిస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో పాలడుగు భాస్కర్, నాయకులు రాపర్తి రాజు, యాటల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం, చిట్యాల సోమన్న తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి: పాదయాత్రను ప్రారంభిస్తున్న రాములు

వివక్ష తగదు..

దేవరుప్పుల: చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి జీపీ సిబ్బందిపై ప్రభుత్వ వివక్ష తగదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. పాదయాత్ర బృందం రాత్రి ధర్మాపురం చేరిన సందర్భంగా జీపీ సిబ్బంది ఘనస్వాగతం పలకగా.. టానూ నాయక్ స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ వస్తే ఉద్యోగాలు పర్మనెంట్ చేస్తామని చెప్పిన సీఎం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, జీఓ 60 అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన హక్కుల సాధనకు ఈనెల 28న ఇందిరాపార్కు వద్ద జరిగే సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు చాగంటి వెంకటయ్య, గ్యార పాండు, గణపతిరెడ్డి, మహేష్, వినోద్ కుమార్, బత్తిని వెంకన్న, బస్వ రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

జోరుగల్లు..!

పోరుగడ్డపై పొలిటికల్ హోరు..

- వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్న నేతలు
- కేడర్‌లో హుషారు పెంచుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్
- అగ్రనేతల పర్యటనలు, పాదయాత్రలతో సందడే సందడి
- ఇక ఎమ్మెల్యేలూ నియోజకవర్గాల బాట

సాక్షిప్రతినిధి, వరంగల్: పోరాటాల పురిటిగడ్డపై ప్రధాన పార్టీల ఎన్నికల సందడి షురువైంది. ఇప్పటి నుంచే కేడర్‌లో జోష్ పెంచేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఆయా పార్టీల అగ్రనేతల పర్యటనలు.. సభలు, సమావేశాలతో ఉమ్మడి వరంగల్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అభివృద్ధి పథకాలు ప్రారంభం, బహిరంగ సభలు, పాదయాత్రల జోరు సాగుతోంది. పోటాపోటీ కార్యక్రమాలతో నియోజకవర్గం, జిల్లా కేంద్రాలు ఎన్నికలను తలపిస్తున్నాయి. ఉద్యమాలకు అడ్డాగా ఉన్న ఓరుగల్లును కేంద్రంగా చేసుకుని పార్టీలు కార్యక్రమాలను ఉధృతం చేశాయి. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్ర నాయకత్వం పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తోంది. కాగా.. ఎమ్మెల్యేలంతా నియోజకవర్గ కేంద్రాల్లోనే ఉండాలని ఇప్పటికే బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ సమావేశాలు ముగియగా.. మంగళవారం నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గాల బాట పట్టనున్నారు.

దూకుడు పెంచిన పార్టీలు..

20 రోజుల వ్యవధిలో ఉమ్మడి వరంగల్‌లో సీఎం కేసీఆర్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. వారు నిర్వహించిన కార్యక్రమాలు, బహిరంగ సభలు ఎన్నికలను తలపించాయి. బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజల్లోకి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ప్రతిపక్షాలకు దీటైన సమాధానం చెప్పే ప్రయత్నం ఆ ముగ్గురు నేతలు చేశారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు సభలు, సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. ఇదే సమయంలో టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఈనెల 6న ములుగు జిల్లా సమక్క–సారలమ్మల సన్నిధి నుంచి ప్రారంభించారు. వారం రోజుల యాత్రలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, శ్రేణులను కలుపుకుని ప్రభుత్వంపై ఘాటైన వ్యాఖ్యలు చేస్తుండటంతో చర్చనీయాంశమవుతున్నాయి. పార్టీ కేడర్‌లో కొత్త జోష్ తెస్తోంది. రెండో విడతగా ఈనెల 14 నుంచి 21 వరకు ఆయన పాలకుర్తి నుంచి భూపాలపల్లి వరకు జోడో యాత్ర షెడ్యూల్ ప్రకటించారు. నియోజకవర్గాలవారీగా కూడా యాత్రలు సాగుతున్నాయి. కాగా.. ఇప్పటికే బీజేపీ చీఫ్ బండి సంజయ్ జిల్లాలో ప్రజా సంగ్రామ యాత్ర నిర్వహించగా.. వారం రోజులుగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు 'స్ట్రీట్ కార్నర్' మీటింగ్‌లు పెడుతున్నారు. అంతకుముందు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు కూడా పర్యటించారు. నర్సంపేటలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పాదయాత్రను వాయిదా వేసిన వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల.. మళ్లీ ఈనెల 2న అక్కడి నుంచే ప్రారంభించి కొనసాగిస్తున్నారు.



వేడెక్కిన పోరాటాల పురిటిగడ్డ

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ... మూడు పార్టీలు సైతం రాష్ట్రంలో బలపడేందుకు, ఉన్న బలాన్ని కాపాడుకునేందుకు పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లును ఎంచుకోవడం చర్చనీయాంశమవుతోంది. వరంగల్ వేదిక నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి అంశాలను చర్చించడం, చర్చ చేస్తుండడం గమనార్హం. కాగా.. జాతీయ, రాష్ట్ర రాజకీయాలకు ఇప్పుడు వరంగల్ వేదిక కావడం హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ఏదైనా, నాయకుడు ఎవరైనా పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు నుంచే తమ సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. నేతల హడావిడి పర్యటనలు, పార్టీల వ్యూహాలు రాజకీయాలను రక్తి కట్టిస్తున్నాయి. పార్టీల నేతల సందడితో ఓరుగల్లులో ఎన్నికల వాతావరణం తలపిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ జోడో యాత్ర, బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, వైఎస్సార్ టీపీ పాదయాత్రలతో ఉమ్మడి వరంగల్ రాజకీయ వాతావరణం వేడెక్కగా.. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు సైతం నియోజకవర్గాల్లోనే తిరగనుండటంతో పరిస్థితి హాట్ హాట్‌గా మారనుందన్న చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

వంతెనపై బస్సుటైర్ పంక్చర్

- రెండు గంటలు ట్రాఫిక్ జామ్
- వాహనదారుల ఇబ్బందులు



నిలిచిన వాహనాలు

హసన్‌పర్తి: హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎల్లాపురం వంతెనపై ఆర్టీసీ బస్సు టైర్‌పంక్చర్ అయి నిలిచిపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. హుజురాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. ఆదివారం సాయంత్రం హనుమకొండ వైపునకు బయలుదేరింది. ఎల్లాపురం బ్రిడ్జి పైకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో నిలిచిపోయింది. ఈక్రమంలో ట్రాఫిక్ జామ్‌తో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నలుగురిపై గృహహింస చట్టం కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శిఖార్‌ఖానగడ్డ ప్రాంతానికి చెందిన బాదావత్ శిరీష తనను అత్తమామలు, ఆడపడుచు, భర్త వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం తెలిపారు. శిరీషకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బాదావత్ వినోద్‌తో 2016లో వివాహమైంది. ఆమె అత్త పద్మ, మామ తులసీరాం, ఆడబిడ్డ మౌనిక తదితరులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. బాధితురాలు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దీపికారెడ్డికి ఫిర్యాదు చేసిందన్నారు.

వ్యక్తిపై కేసు



కూలీలను పరిశీలిస్తున్న పోలీసులు


వాజేడు : బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. మండల పరిధిలోని పేరూరుకు చెందిన బొల్లె యేసు మిర్చి కాయలను ఏరడానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసకూలీలను తీసుకొచ్చాడు. అందులో 13 ఏళ్ల వయస్సు ఉన్న పోయం సుందరి, పోయం సుమిత్ర ఉన్నారు. వారితో మిర్చితోటలో కాయలను ఏరిస్తుండగా చైల్డ్‌లైన్ టీముకు చెందిన రమ్య ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి వారిని పనిలో నుంచి తప్పించారు. అనంతరం బొల్లె యేసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను ఎవరూ పనిలో పెట్టుకున్న చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ మాషూఖ్ రబ్బాని

- నేటి నుంచి దర్గా ఉత్సవాలు
- వివిధ ప్రాంతాల నుంచి పలువురి రాక
- ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు



హజ్రత్ మాషూఖ్ రబ్బాని దర్గా(ఫైల్)

న్యూశాయంపేట/కరీమాబాద్ : మతసామరస్యానికి ప్రతీకగా వరంగల్ ఉర్సు జాగీర్ ప్రాంతంలోని హజ్రత్ మాషూఖ్ రబ్బాని (రహమతుల్లా అలై) దర్గా నిలుస్తుంది. 467 ఏళ్ల చరిత్ర ఉన్న దర్గా ఉర్సు ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉత్సవాల ప్రధానఘట్టం సంధల్(గంధం) ఊరేగింపు సోమవారం రాత్రి ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామువరకు సాగుతుంది. ఫకీర్ల విన్యాసాలు, మేళతాళాలతో హజ్రత్ మాషూఖ్ రబ్బాని పవిత్ర సమాధి వరకు సాగనుంది. ఊరేగింపులో కుల మతాలకతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటారు. ఉర్సు జాగీర్‌లోని మొదట పీఠాధిపతి గడీ నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకవచ్చి సమాధిపై లేపనం చేస్తారు. అనంతరం ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహిస్తారు.

పవిత్ర గంధం కార్యక్రమం...

ఉర్సు జాగీర్‌లోని పీఠాధిపతి ఇంటి నుంచి సోమవారం రాత్రి గంధం ఊరేగింపు ప్రారంభం అవుతుంది. 14వ తేదీ రాత్రి వరకు ఉర్సు జరుగుతుంది. అనంతరం ప్రసాద వితరణ, నాతియా మైఫిల్, సందల్‌ఖాని, షబ్‌చిరాఖ్ వేడుక ఉంటుంది. బుధవారం ఉదయం పవిత్ర ఖురాన్‌పఠనం, సలాం, పాతిహా, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి....

హజ్రత్ మాషూఖ్ రబ్బానీ ఉర్సు ఉత్సవాల్లో కుల మతాలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పీఠాధిపతి సయ్యద్ మోహినొద్దీన్ అహ్మద్ భక్తియార్ ఖాద్రీ తెలిపారు. ఆదివారం దర్గా గడిలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సయ్యద్ జమాలుద్దీన్ అహ్మద్ ఖాద్రీ, సయ్యద్ సాబిర్ ఆలం ఖాద్రీ, సయ్యద్ హబీబ్ ఆలం ఖాద్రీలు పాల్గొన్నారు.

విస్తృత ఏర్పాట్లు

ఉర్సు ఉత్సవాలకు ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, కలెక్టర్ యంత్రాంగం, మహానగర పాలక సంస్థ పోలీసులు తమ సిబ్బందికి పలు సూచనలు చేసి ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

దర్గా చరిత్ర..

హజ్రత్ మాషూఖ్ రబ్బాని(రహమతుల్లా అలై) ప్రపంచంలోని సమస్త మానవాళి సన్మార్గంలో పయనించాలనే ఉద్దేశ్యంతో భక్తిమార్గంలో బోధనలు చేస్తూ ఈ ప్రాంతానికి విచ్చేశారని పూర్వీకులు చెపుతున్నారు. హజ్రత్ మాషూఖ్ రబ్బాని గొప్పతనం, మహిమల గురించి స్థానికులు ఇప్పటికీ చర్చించుకుంటారు. ఇస్లాం బోధనలు, ప్రచారం కోసం దేశానికి ముఖ్యంగా దక్షిణభారత్‌లో గొప్ప స్థానాన్ని పొందాడు.

అప్పు ఇచ్చిన వారు దూషించారని..

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య



లచ్చిరాం(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నెక్కొండ : అప్పు ఇచ్చిన వారు దూషించారని మనస్తాపానికి గురై ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వెంకటాపురం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, తండావాసులు తెలిపిన వివరాల పకారం.. గ్రామ శివారు గంగదేవితండాకు చెందిన జాటోతు లచ్చిరాం(45)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరంలో వరి, మరో ఎకరంలో పత్తి పంట సాగుచేశాడు. వ్యవసాయం, ఇతర అవసరాల కోసం అదే తండాకు చెందిన జాటోతు చక్రు వద్ద రెండేళ్ల క్రితం రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అయితే సరైన దిగుబడి రాక అప్పు చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ క్రమంలో ఈనెల 11న చక్రు భార్య జమ్లీ అప్పు విషయమై లచ్చిరాం ఇంటికి వెళ్లి నిలదీసింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో జమ్లీ దుర్భాషలాడింది. తీసుకున్న అప్పు చెల్లించకుండా అరెకరం భూమి ఎలా కొనుగోలు చేస్తావని నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన లచ్చిరాం సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు చేరుకొని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు లచ్చిరాం కోసం రాత్రి నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు వెతికి చివరికి వ్యవసాయ భూమి వద్దకు చేరుకోగా లచ్చిరాం విగత జీవిగా కనిపించాడు. దీంతో అప్పుల వారు వేధించడంతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ మృతదేహాన్ని చక్రు ఇంటివద్ద వేసి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఉపసర్పంచ్, మృతుడి భార్య బూలి(లలిత) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని వారు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారులు నవీన్, పండు ఉన్నారు.

ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధం



ఆలింపూర్‌లోని జామాయిల్ తోటలో చెలరేగుతున్న మంటలు

బచ్చన్నపేట : మండలంలోని ఆలింపూర్‌లో ప్రమాదవశాత్తు జామాయిల్ తోట దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దండ్యాల మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి లతో పాటు పలువురి 35 ఎకరాల జామాయిల్ తోట ఉంది. ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగగా గమనించిన రైతులు జనగామ ఫైర్‌స్టేషన్‌కు ఫోన్‌చేయగా ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలార్పింది. ఈ ఘటనలో సుమారు 25 ఎకరాల వరకు తోట కాలిపోయింది. బాధిత రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో.. ముగ్గురికి తీవ్రగాయాలు

చెన్నారావుపేట: బైక్‌ను తప్పించబోయి ఓ ఆటో చెట్టును ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోజిపేటకు చెందిన ఆటో నర్సంపేట నుంచి ఆరుగురు ప్యాసింజర్లను తీసుకొని జోజిపేటకు వెళ్తున్నాడు. చెన్నారావుపేట గ్రామశివారులోని వైన్స్ షాపు వద్దకు రాగానే వేలుబల్లికి చెందిన ఏపీ 36 డి 4264 నంబర్ గల ద్విచక్రవాహనదారుడు వైన్స్‌షాపు నుంచి ఒక్కసారిగా రోడ్డు పైకి రావడంతో ఆటోడ్రైవర్ బైక్ వ్యక్తిని తప్పించబోయి అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై తోట మహేందర్ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

యువకుడిపై కత్తిపీటతో దాడి

చెన్నారావుపేట: పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని యువకుడిపై కత్తిపీటతో దాడి చేసిన ఘటన మండలంలోని లింగగిరిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన బూరుగు రాజేందర్ ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ఊర చెరువు సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన చిందం విజయ్ పాత కక్షలను మనసులో పెట్టుకొని కత్తిపీటతో రాజేందర్‌పై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో రాజేందర్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు చికత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు తండ్రి బూరుగు చిన్న సూరయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రూ. 30 కోట్ల విలువైన చెరువు శిఖం కబ్జా



చెరువులో ప్లాట్లు



భీమారంలోని శ్యామల చెరువు

- చెరువులో వెలసిన ప్లాట్లు...
- దర్జాగా 'రియల్' వ్యాపారం
- ఫిర్యాదులు అందాయి : డీఈఈ రాజు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురైంది. సుమారు 20 ఎకరాల మేరకు కబ్జాకు గురైన భూమి విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉంటోంది. ఇక్కడ ఎకరం భూమి విలువ రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లకు పలుకుతుంది. చెరువును కేంద్రంగా చేసుకుని రియల్ దందా కొనసాగిస్తున్నారు. ఏకంగా 20 ఎకరాల శిఖాన్ని ఆక్రమించుకున్నారు. ఈ భూమిని ప్లాట్లుగా చేసి వ్యాపారం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే భీమారంలోని శ్యామలచెరువు సుమారు 67.20 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఈ చెరువు కింద 400 ఎకరాల ఆయకట్టు ఉండేది. అయితే కాలక్రమేణా నగరంలో విస్తరించడంతో వ్యవసాయ భూములు, వ్యవసాయేతరంగా మారాయి. ప్రస్తుతం ఈ చెరువు పరిధిలో సాగుభూమి లేకుండా పోయింది. అయితే భూగర్భజలాలు పడిపోకుండా ఉండేందుకు స్థానికులు చెరువును కాపాడుతూ వస్తున్నారు. అయితే రియల్టర్లు మాత్రం చెరువును మింగుతున్నారు..

రిజిస్ట్రేషన్ ఓ సర్వే నంబర్.... ప్లాట్లు మరో నంబర్‌లో..

అయితే పక్కనే పట్టాదారుడితో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేసుకుని చెరువు శిఖంలోకి (చెరువు సర్వేనంబర్ 642) వచ్చి దర్జాగా ప్లాట్లు చేసుకున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కరిద్దరు కాదు పదుల సంఖ్యలో రియల్టర్లు చెరువును కబ్జా చేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మించి ప్లాట్లుగా చేశారు. మరికొంతమంది చెరువును ప్లాట్లుగా విభజించారు. రియల్టర్లు కాకుండా కొంతమంది శిఖాన్ని ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారుల సహకారం...

కాగా, అధికారులు ఇష్టం వచ్చినట్లు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రియల్టర్లు నయానో బయానో ఇచ్చి అప్పుడు అనుమతి తీసుకున్నారు. చెరువు సమీపంలో ఇళ్ల అనుమతికి తప్పని సరిగా నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి. అయితే మామూళ్లు పుచ్చుకున్న అధికారులు అవేమి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వేకు డిమాండ్..

శ్యామల చెరువు సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని స్థానికంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్‌గా మారింది. అధికార పార్టీ నాయకుల సహకారంతోనే రియల్‌దందా సాగుతోందని వాట్సాప్‌లో వైరల్ అయింది.

ఫిర్యాదులు అందాయి

చెరువు కబ్జా అయినట్లు ఫిర్యాదులు అందాయి. నాలుగైదు రోజుల్లో సర్వే చేపడుతాం. ఎఫ్‌టీఎల్ వరకు హద్దులు నిర్ధారిస్తాం. ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తాం.

– రాజు, నీటిపారుదలశాఖ, డీఈఈ



గూగుల్ మ్యాప్

మామిడి రైతులూ..జాగ్రత్త !



మామిడి పూతలో వస్తున్న తెగుళ్లు

విరగపూసిన మామిడి పూత

- పూతకు తెగుళ్ల బెడద
- సస్యరక్షణ చర్యలు పాటించకపోతే నష్టం

కరీమాబాద్: ప్రస్తుతం మామిడి పూతదశలో ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ అనుకూలంగా పూత బాగా వచ్చినప్పటికీ చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి రక్షించుకోకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు ఎప్పటికప్పుడు పూతను పరిశీలించుకుంటూ సస్యరక్షణ చర్యలు పాటించకపోతే మొదటికే మోసం వస్తుందని సూచిస్తున్నారు. డిసెంబర్ నుంచి ప్రారంభమయ్యే పూత ఫిబ్రవరి వరకు వస్తుందన్నారు.

పూత దశలో వచ్చే తెగుళ్లు...

మామిడిలో పూత దశలో ఎక్కువగా బూడిద, నల్లమచ్చ తెగుళ్లు, తేనెమంచు, తామర, పూత పురుగుల పూతను ఆశించడంతో కాయ దిగుబడి తగ్గుతుంది.

బూడిద తెగులు లక్షణాలు....

వాతావరణం రాత్రిపూట చల్లగా పగటి పూట వెచ్చగా ఉన్నప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పూతకాండం, పూల, చిన్నపిందెలపై తెల్లని పొడి లాంటి బూజు పదార్థంగా చేరడంతో పూత, కాత రాలిపోతుంది.

నివారణ కోసం...

మొగ్గలు కనిపించే దశలో 1 లీటరు నీటిలో 3 గ్రాముల గంధకం కలిపి పిచికారి చేయాలి. పరిస్థితులను బట్టి హెక్సాకోనజోల్, ప్రొపికోనజోల్, డినోకాఫ్, ట్రై డిమార్ఫ్ లాంటివి మోతాదు ప్రకారం పిచికారి చేయాలి.

ఆకుపచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు...

పొగమంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్ల ఉధృతి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఇవి మొదటగా లేత ఆకులు, పూలను ఆశిస్తాయి. ఆకులమీద గోధుమరంగులో మచ్చలు ఏర్పడి ఆకులు పండు బారి రాలిపోతాయి. రెమ్మలపైన కూడా నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు, పూలు మాడిపోయి కాయలు రాలిపోతాయి.

నివారణ కోసం....

పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, బోర్డో కలిపి పిచికారి చేయాలి. కార్బండిజమ్, థయోఫినేట్ లాంటి మందులు మోతాదులో పిచికారి చేయాలి.

పూత దశలో పాటించాల్సిన పద్ధతులు..

- భూమిలో తేమ కోసం పూత వచ్చిన తర్వాత ప్రతీ 10–15 రోజులకోసారి నీటి తడి పెట్టాలి.
- చలి ఎక్కువ ఉంటే పూత రావడం ఆలస్యమవుతుంది. కాబట్టి 10 గ్రాముల మల్టీ-కే (పొటాషియం నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి పిచికారి చేయాలి.
- పూత సమయంలో రైతులు కొమ్మ కత్తిరింపు, దున్నడం లాంటివి చేయకుండా మొక్కలకు విశ్రాంతినివ్వాలి.

తేనె మంచు పురుగు...

తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండాలు, పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చడం మూలంగా ఆకుల చివర్లో మాడిపోయి పూత మాడిపోతుంది. పిందెలు రాలిపోతాయి. ఆకులు, కాండం, కాయలపై మసి పొర ఏర్పడుతుంది.

నివారణ కోసం..

ఈ పురుగు నివారణ కోసం మోనోక్రోటోఫాస్, డైక్లోరోవాస్, డైమెథోయేట్, జిథైల్‌డెమటాన్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదులో పిచికారి చేయాలి.

పూత పురుగు...

ఈ పురుగు అరుదుగా కనిపిస్తుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టడం ద్వారా వచ్చిన పిల్లపురుగులు పూల కాడలోకి చొచ్చుకుపోయి కాడ భాగాన్ని తింటాయి. దీంతో పూల కాడలు వంగిపోయి ఎండిపోతాయి. పూత రాలిపోతుంది.

నివారణ కోసం....

మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, పాస్ఫమిడాన్, డైక్లోరోవస్ సరైన మోతాదులో పిచికారి చేయాలి

తామర పురుగు..

గత సంవత్సరం ఈ పురుగు మామిడితోటలతో పాటు మిరప పంటలను నష్టపరిచింది. మామిడి పంట పూత సమయంలో రసం పీల్చడం మూలంగా పూత ఎండిపోయి రాలిపోతుంది. తామర, మంచు పురుగులు మంగు తెగులును వ్యాప్తి చెందేలా చేస్తాయి.

నివారణ కోసం..

ఈ పురుగు నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్, థయామిథాగ్జామ్‌లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో వస్తున్న మార్పులను రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. పూత, కాండంలను పరిశీలిస్తూ ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకుంటూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకున్నట్లయితే మామిడి పూత రాలకుండా చూసుకోవచ్చు. మందుల పిచికారి కూడా వారి సూచనల మేరకే మోతాదు ప్రకారం చేయాలి.

– డాక్టర్ అగుర్ల రాజు, శాస్త్రవేత్త- కేవీకే మామునూరు

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



శవాన్ని బావినుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

పరకాల: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు పరకాల మండలం మల్లక్‌పేట గ్రామానికి చెందిన దొమ్మాటి కుమారస్వామి(45)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కుమారస్వామి నిత్యం మద్యం మత్తులో ఉంటూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఇంట్లో వస్తువులు అమ్ముకుంటూ మద్యం మత్తులో ఇంటికి చేరుకొని భర్త వేధింపులు భరించలేక పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసినా ఫలితం కనిపించకపోయింది. ఏడాది క్రితం భార్య సువర్ణ పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం తాగడం మానుకోవాలని మందలించిన తండ్రిపై ఈ నెల 3న దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారస్వామి ఆదివారం మల్లక్‌పేట గ్రామ కర్ణకుంట చెరువు శివారులోని బైరెడ్డి తిరుపతిరెడ్డి వ్యవసాయలో బావిలో కుళ్లిపోయిన శవంగా గ్రామస్తులకు కనిపించాడు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు తమకు ఎవరిపై అనుమానం లేదని మద్యం మత్తులోనే కాలు జారి వ్యవసాయబావిలో పడి చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుళ్లిన శవాన్ని బయటకు తీయడానికి గ్రామస్తులు ఎవరూ కూడా ముందుకు రాకపోవడంతో పరకాల సీఐ పుల్యాల కిషన్ గత ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. మృతుడుకి భార్య సువర్ణ, కుమారుడు ఉన్నారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు..

మడికొండ: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన రాంపూర్ శివారులోని స్టేషన్‌పెండ్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నూనెముంతల గోపాల్ (72) ప్రతీరోజు మాదిరిగానే ఆదివారం ఉదయం కల్లు తీయడానికి స్టేషన్‌పెండ్యాల సమీపంలోని తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి ధర్మసాగర్ పోలీసులు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.



గోపాల్ మృతదేహం

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ..

గీసుకొండ: మండలంలోని వరంగల్ -నర్సంపేట రహదారి కోటగండి పీడీఆర్ గార్డెన్స్ సమీపంలో ఇటుక ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో దానిపై కూర్చున్న కూలీ కిందపడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ వెంకన్న, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన సింగిరెడ్డి కృష్ణ(30) ఊకల్ గ్రామశివారులోని నెల్లుట్ల మల్లేశం ఇటుకబట్టీ పనికి వెళ్లి అతడి ట్రాక్టర్‌లో ఇటుకలు లోడ్ చేసి ఉదయం వరంగల్‌కు తీసుకుని వెళ్తున్నారు. డ్రైవర్ దాట్ల ప్రశాంత్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లింది. ట్రాలీ టైరు సింగిరెడ్డి కృష్ణ తలపై నుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



సింగిరెడ్డి కృష్ణ(ఫైల్)

వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

హసన్‌పర్తి: కాకతీయ పోలీస్‌స్టేషన్ పరిధి పెగడపల్లిలోని ఓ వ్యవసాయ పొలంలో 60 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన చింతల సాంబయ్య రైతు నారుమడిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఉన్నాడనే సమాచారం మేరకు ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తి మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై చెప్పారు. వివరాలకు కేయూసీ పోలీసులను సంప్రదించాలని సూచించారు.